క్లుప్తంగా

నారు మడులను సిద్ధం చేసుకోవాలి

ఉప్పలగుప్తం: ఖరీఫ్ నేపథ్యంలో రైతులు ముందస్తుగా నారుమడులను సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి మండల వ్యాప్తంగా ఉన్న ఆర్బీకేల్లో ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాలకు చెందిన 50 క్వింటాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా ప్రైవేటు ఏజెన్సీల్లో 150 క్వింటాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ముందస్తు సాగు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు.

తాచుపాము హల్ చల్



ప్లాస్టిక్ డబ్బాలో పామును బంధిస్తున్న గణేష్ వర్మ

ముమ్మిడివరం: స్థానిక స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న కొబ్బరి కొట్టులో సోమవారం తాచుపాము ప్రవేశించి హల్ చల్ చేసింది. అది గమనించిన షాపు యజమాని సత్తిబాబు రాజు భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దేశ భవిష్యత్తుకు బీజేపీ కట్టుబడి ఉంది

కాట్రేనికోన: దేశ భవిష్యత్తుకు ఎన్డీఏ కూటమిలోని బీజేపీ కట్టుబడి ఉందని ముమ్మిడివరం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొలకోటి వెంకటరెడ్డి అన్నారు. దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ నాయకుడు గ్రంధి నానిబాబు స్వగృహం వద్ద పార్టీ జెండాను ఎగుర వేసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి సభ్యులు జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, మండల శాఖ అధ్యక్షుడు మట్ట సూరిబాబు, సుంకర నాగేశ్వరరావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుంకరపాలెం శివాలయ వార్షికోత్సవం



వీరేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో వేంచేసియున్న భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి ఆలయ 13వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు భీమేశ్వర శర్మ, ప్రసాద్ శర్మ పర్యవేక్షణలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు దంపతులచే స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బాల కార్మికులతో పని చేయిస్తే కఠిన చర్యలు



కాట్రేనికోనలో బైక్ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్ శర్మ

కాట్రేనికోన: బాల కార్మికులతో పనులు చేయిస్తే యజమానులపై కఠిన చర్యలు తప్పవని రాజోలు లేబర్ ఆఫీసర్ కేబీఆర్ శర్మ హెచ్చరించారు. సోమవారం కాట్రేనికోన మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన సైకిల్ షాపులు, భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లను తనిఖీ చేశారు. 18 ఏళ్ల లోపు వయసున్న వారిని పనుల్లో పెట్టుకోరాదని ఆయా యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కనకరాజు, జన కల్యాణి వెల్ఫేర్ సొసైటీ ఎన్జీఓ రాజు, సీఆర్‌ఎంటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎంఎస్‌ఏతోనే మాతా శిశు మరణాల నివారణ

ఆలమూరు: మాతృత్వ, శిశు మరణాల నివారణకు, చిన్నారుల మెరుగైన ఆరోగ్య సంరక్షణను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకం విశేషంగా దోహదపడుతుందని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలా దేవి, పి.భవానీశంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా ఆయా పీహెచ్‌సీలో నిర్వహించిన పీఎంఎంఎస్‌ఏ శిబిరంలో సుమారు 132 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సమావేశంలో బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ వివరించారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు బాట

- యానాంలో పూర్తి స్థాయిలో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు
- కరిక్యులమ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



సీబీఎస్‌ఈ కరిక్యులమ్‌పై జరుగుతున్న శిక్షణ తరగతులు

యానాం: చాలా ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న కేంద్రపాలిత ప్రాంతం యానాంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఉన్నత తరగతులకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) సిలబస్‌ను అమలుచేయనున్నారు. ఇప్పటికే సీబీఎస్‌ఈ కరిక్యులమ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. దీని కోసం మాక్‌మిలాన్ ఎడ్యుకేషన్ ఇండియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఇన్నేళ్లూ ఏపీ బోర్డునే అనుసరించారు

యానాంకు ప్రత్యేక విద్యాబోర్డు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ విద్యా బోర్డునే ఇన్నాళ్లు అనుసరిస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిలబస్‌నే అమలుచేసేవారు. ఆఖరికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సైతం ఆంధ్రప్రదేశ్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు ద్వారానే జరిగేవి. మొత్తం పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతంలోని యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి నాలుగు రీజియన్లలోనూ ప్రత్యేక బోర్డులు లేవు. దీంతో యానాం ఏపీ బోర్డును, మాహే కేరళ బోర్డును, కారైకల్, పుదుచ్చేరి తమిళనాడు విద్యాబోర్డులను అనుసరిస్తూ వస్తున్నాయి. 2015-16 నుంచి ఇప్పటికే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ యానాంలో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు జరుగుతుంది. ప్రస్తుతం 2023-24 విద్యా సంవత్సరంలో 9వ తరగతి వరకూ అమలుచేశారు. తాజాగా 2024-25 విద్యాసంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో 10, 11, 12 తరగతులు అంటే ప్లస్‌టూ వరకూ సీబీఎస్‌ఈ అమలుచేయనున్నారు.

సీబీఎస్‌ఈతో ఎంతో మేలు

నూతనంగా ఉన్నత తరగతుల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలుచేయనున్న నేపథ్యంలో సీబీఎస్‌ఈ విద్యాప్రణాళికపై ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో భాగంగా నెలవారీ, వార్షిక ప్రణాళికలు తయారుచేసి బోధించేలా చేయడం, వినూత్న బోధన, మూల్యాంకన పద్ధతులు, పాఠ్యప్రణాళికపై వివరణాత్మక చర్చలు చేయడం, పాఠ్యాంశాల్లో మార్పులపై అవగాహన పెంచడం తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. సీబీఎస్‌ఈ పరీక్షల్లో సబ్జెక్టు వారీగా 33 మార్కులు వస్తే పాసవుతారని, అదే విధంగా అందులో 20 ఇంటర్నల్ మార్కులు ఉంటాయని ఉపాధ్యాయులు తెలిపారు. పరీక్షల్లో ప్రశ్నలు సైతం డైరెక్టుగా కాకుండా క్రిటికల్, ఎనలైటికల్ పద్ధతిలో ఉంటాయన్నారు. విద్యారంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సైతం సీబీఎస్‌ఈ కరిక్యులమ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థుల ఉజ్వల భవితకు బంగారు బాట అవుతుందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో టీజీటీ(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్)కు శిక్షణను స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో ప్రారంభించారు.

ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అమలు

సీబీఎస్‌ఈ సిలబస్‌ను ఈ ఏడాది నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఆయా పాఠ్యాంశాల బోధనపై శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన పెంచి వారిని సంపూర్ణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడమే సీబీఎస్‌ఈ కరిక్యులమ్ ప్రధాన లక్ష్యం.

– పంపన లక్ష్మణ్ ప్రవీణ్, విద్యాశాఖాధికారి

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ సీబీఎస్‌ఈ

ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ సీబీఎస్‌ఈ ఉన్నత తరగతులకు సైతం సీబీఎస్‌ఈ కరిక్యులమ్ అమలు చేస్తున్నాం. సీబీఎస్‌ఈ కరిక్యులమ్‌పై సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నాం. మాక్‌మిలాన్ ఎడ్యుకేషన్ ఇండియా సంస్థతో ఒప్పందం మేరకు వారి సహకారంతో శిక్షణ విజయవంతంగా జరుగుతుంది.

– కమిడి ప్రభాకరరావు, ఎస్ఎస్ఏ ఏడీపీసీ, యానాం

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



శ్రీకాంత్‌కు స్వామి చిత్రపటాన్ని, లడ్డూను అందజేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన బండి శ్రీకాంత్ సోమవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. తన తల్లి బండి భవాని జ్ఞాపకార్థంగా అందజేస్తున్నట్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ అర్చకులకు అందజేశారని ఏసీ గ్రంధి మాధవి తెలిపారు. విరాళాలు అందించిన దాతకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఇసుక నిల్వల సీజ్

రావులపాలెం: మండలంలో రావులపాడు జాతీయ రహదారి పక్కన గతంలో నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేసి తమకు అప్పగించినట్టు సోమవారం తహసీల్దార్ అశోక్ వర్మ తెలిపారు. మైనింగ్ అధికారులు ఇసుక నిల్వలను పరిశీలించి సీజ్ చేశారని, అనంతరం గ్రామ వీఆర్వోకు అప్పగించారన్నారు.

విద్యతో బాలల భవిష్యత్‌కు బంగారు బాటలు



కామనగరువు పితానివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

అమలాపురం రూరల్: అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్య బోధించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నామని సీడీపీవో విజయకుమారి అన్నారు. పేరూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణ ఆధ్వర్యంలో కామనగరువు పరిధి పితానివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను ఒకటో తరగతి ప్రవేశాల కోసం ప్రభుత్వ పాఠశాలలకు పంపించారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే కాకుండా విద్యను బోధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.దుర్గాబాయి, సీహెచ్ పద్మ, యు.నిర్మలకుమారి, ఎం.వెంకటరమణమ్మ, మాకే సరితా జ్యోతి, బి.బీమాభాయ్, జె.ధనలక్ష్మి, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ప్రసాద్ సేవలు అభినందనీయం

ఉమ్మడి జిల్లా ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ మూర్తి



ఈశ్వర ప్రసాద్ అభినందన సభలో మాట్లాడుతున్న ఎస్ఈ మూర్తి

అమలాపురం రూరల్: ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం టౌన్ ఏఈగా పనిచేసిన ఆకుల వీరవెంకట సత్యఈశ్వర్ ప్రసాద్ అందించిన సేవలు అభినందనీయమని ఉమ్మడి జిల్లా ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ టీఎస్ఎన్ మూర్తి అన్నారు. సత్యఈశ్వర్ ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా మండలంలోని పేరూరులో ఉన్న కల్యాణ మండపంలో సోమవారం ఆయనకు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మూర్తి మాట్లాడుతూ ప్రసాద్ అమలాపురం, రాజమహేంద్రవరం ఏఈగా అంకిత భావంతో పనిచేశారని కొనియాడారు. అనంతరం సత్య ఈశ్వర్ ప్రసాద్ దంపతులను అమలాపురం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మోకా రవికుమార్, వై.విజేందర్‌నాథ్, శ్రీధర్ వర్మ, ఏపీ ఈపీఈపీడీసీఎల్ మాజీ సీజీఎం వైస్ ప్రసాద్, ఏఈ విజయ ప్రసాద్ తదితరులు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏడీలు అన్నవరం, వీరభద్రరావు, శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘ నాయకులు ఆకుల రమేష్, ఎంవీ రమణ, నెల్లి సత్యనారాయణ, తాతారావు, పీ.భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ విజేత అల్లవరం జట్టు



ఫైనల్లో విజయం సాధించిన అనంతరం ట్రోఫీని ప్రదర్శిస్తున్న అల్లవరం క్రీడాకారులు

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో అల్లవరం జట్టు విజేతగా నిలిచింది. పిండి సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ యువత ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బెండమూర్లంకపై అల్లవరం జట్టు ఉత్తమ ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టు క్రీడాకారులకు టోర్నమెంట్ నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు.

శాంతియుత సమాజానికి క్రీస్తు బోధనలు దోహదం



బాప్టిస్టు చర్చిని ప్రారంభిస్తున్న వసంతరావు తదితరులు

యానాం: శాంతియుత సమాజానికి ఏసుక్రీస్తు బోధనలు దోహదపడతాయని ఆయన చెప్పిన మార్గాన్ని అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందని క్రీమ్ సంస్థ డైరెక్టర్, రెవరెండ్ బిషప్ దొమ్మేటి వసంతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక మెట్టకూరు గణపతినగర్‌లో నూతనంగా నిర్మించిన మదర్ సుశీల మెమోరియల్ బాప్టిస్టు చర్చి ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు తెలిపిన విశ్వాసం, ప్రేమ, క్షమాపణ తదితర బోధనల గురించి వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు, జార్జిపేట, కోరంగి, తాళ్లరేవు, కాకినాడ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాస్టర్లు కార్యక్రమానికి విచ్చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ప్రియాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సెమీఫైనల్ మ్యాచ్‌లు

యానాం: యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(వైడీసీఏ) ఆధ్వర్యంలో స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో గత నెల 22వ తేదీ నుంచి లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న సీచమ్ క్రికెట్ ట్రోఫీ-2024 సెమీఫైనల్స్ సోమవారం హోరాహోరీగా జరిగాయి. ఈ ట్రోఫీలో మొత్తం 10 జట్లు పాల్గొనగా మొత్తం 20 మ్యాచ్‌లను నిర్వహించారు. సెమీ ఫైనల్ మ్యాచ్‌ల్లో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ఫస్ట్ సెమీఫైనల్ మ్యాచ్‌లో నాగా లెవెన్స్, కేవీఆర్ జట్లు తలపడగా నాగా ఎలెవెన్స్ జట్టు విజయం సాధించింది. రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో అంబేడ్కర్ ఎలెవెన్స్, అగ్ని లయన్స్ జట్లు తలపడగా అంబేడ్కర్ ఎలెవెన్స్ గెలుపొందింది. ఫైనల్స్‌లో అంబేడ్కర్ ఎలెవెన్స్, నాగా ఎలెవెన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. కార్యక్రమంలో అధ్యక్షుడు పి.రమేష్, సెక్రటరీ కె.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ చిట్టి, కె.ప్రసాద్, పి.ప్రసాద్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ పంతగడ సుమన్‌బాబు, సత్యం, కె.జయచంద్ర, కె.సత్యనారాయణ, పీఈటీలు పాలికి ప్రకాష్, చింతా వెంకన్న పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగు నీరిస్తాం



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ



సదస్సుకు హాజరైన రైతులు

పి.మల్లవరం రైతు సదస్సులో ఉన్నతాధికారుల హామీ

తాళ్లరేవు: మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలన్నింటినీ పరిష్కరించి ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ తెలిపారు. సోమవారం పి.మల్లవరం పంచాయతీలోని ధూళిపూడి గొల్లబాబు, రాజేశ్వరి కల్యాణ మండపంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన నిర్వహించిన రైతు సదస్సుకు పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖరీఫ్, రబీ పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీటి ఎద్దడి కారణంగా తీవ్ర నష్టాలు చవిచూస్తున్నామని రైతులు ప్రస్తావించారు. ఒకపక్క సాగునీరు లేక వరిచేలు ఎండిపోతున్నా, మండల పరిధిలోని చమురు సంస్థలు మాత్రం యథేచ్ఛగా నీటిని తరలించుకు పోతున్నాయన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కుడుపూడి శివన్నారాయణ, ధూళిపూడి వెంకటరమణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, టి.ఈశ్వరరావు, మోర్త రాజశేఖర్ తదితరులు రైతు సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు చేశారు. పంట కాలువల్లో పూడికలు తొలగించాలని, ఇంజరం వంతెన నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ వర్మ, ఇరిగేషన్ డీఈ హిమరత్న, ఏఈ ఈశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీప్రసన్న, వ్యవసాయ శాఖ ఏఈ ఎన్.ప్రశాంతి, డ్రైనేజ్ శాఖ ఏఈ సునీత, అల్లూరి రామకృష్ణంరాజు, పంపన రామకృష్ణ, బర్రే బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ దోలామణి రాజీనామా



అధికారులకు తన రాజీనామా పత్రం అందజేస్తున్న దంగేటి దోలామణి

అమలాపురం రూరల్: అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేసినట్లు ఆమె తెలిపారు. తనకు పదవి ఇచ్చిన మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సోమవారం దంగేటి దోలామణి, రుద్ర దంపతులు మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, వారికి ఏ కష్టమొచ్చినా తాము అందుబాటులో ఉంటామని ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ చేపట్టే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని మళ్లీ పార్టీ విజయం కోసం కృషి చేస్తామని తెలిపారు. 9 నెలల తన పదవీ కాలంలో మాజీ మంత్రి విశ్వరూప్ సహకారంతో అమలాపురం రైతు బజార్ స్థలంలో మార్కెట్ కమిటీకి భవన నిర్మాణం కోసం రూ.2.40 కోట్లు, ఉప్పలగుప్తంలో అసంపూర్తిగా మిగిలిపోయిన గోడౌన్ నిర్మాణం కోసం రూ.40 లక్షలు మార్కెటింగ్ శాఖ కమిషనర్ నుంచి మంజూరు చేయించామన్నారు. సదరు పనులకు శంకుస్థాపన చేద్దామన్న సమయానికి ఎలక్షన్ కోడ్ రావడం వల్ల ఆగాయన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు బీసీ ఉద్యోగుల అభినందన



ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందనలు తెలుపుతున్న జిల్లా బీసీ ఉద్యోగ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘ సమావేశం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన గంటి హరీష్ మాధూర్‌తో పాటు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికైన ఎమ్మెల్యేలకు అభినందనలు తెలుపుతూ సమావేశం తీర్మానం చేసింది. అమలాపురం, రామచంద్రపురం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వాసంశెట్టి సుభాష్‌లకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ పల్లంరాజు, సంఘ ఆర్థిక కార్యదర్శి పీవీ గోపాలం, రాష్ట్ర సంఘం నాయకులు బీవీవీఎస్ మూర్తి, రాజేశ్వరీదేవి, కడలి వెంకటేశ్వర్లు, విత్తనాల శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోరిని మోడల్ విలేజ్‌గా తయారు చేసుకోవాలి



కుట్టు మెషీన్ శిక్షణ సర్టిఫికెట్లు ఇస్తున్న జేసీ నుపూర్ అజయ్

సఖినేటిపల్లి: సమాజం కోసం చేస్తున్న మంచి పనులను పోషించుకుని మోరి ప్రజలంతా మోరిని మోడల్ విలేజ్‌గా తయారు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జేసీ నుపూర్ అజయ్ సూచించారు. సోమవారం మోరిపోడు సుబ్బమ్మ హాస్పిటల్ నేతృత్వంలో కమ్యూనిటీ హెల్త్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ నల్లి దారియన్ మోరి–మోరిపోడు సరిహద్దులోని మొండికోడు చానల్‌కు పొక్లెయిన్‌తో చేపట్టిన పనులను జేసీ నుపూర్ పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఏటా పంట కాలువలు మూసుకుపోతున్న వైనంపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల కోసం చేపడుతున్న పనులకు ప్రజలంతా సహకరించి, పంటకాలువలను పరిశుభ్రంగా చూసుకోవాలని జేసీ హితవు పలికారు. రివర్‌సైడు స్కూల్ ఆవరణలో ప్రాజెక్ట్ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ ఎడ్యుకేషన్ సెంటర్‌కు జేసీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఉషా ఇంటర్నేషనల్, ప్రాజెక్ట్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మెషీన్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను జేసీ పంపిణీ చేశారు. సుబ్బమ్మ మిషన్ హాస్పిటల్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై రూపొందించిన డాక్యుమెంటును స్క్రీన్‌పై డాక్టర్ లత, జేసీ నూపుర్ అజయ్‌కు వివరించారు. వీవీర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు జాన శంకరరావు, మోరి, మోరిపోడు గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజ్ కల్చర్‌తో అధిక లాభాలు



లబ్ధిదారుడికి నమూనా చెక్కు అందిస్తున్న డాక్టర్ జోకే కుజాకుడిన్

అల్లవరం: కేజ్ కల్చర్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని విశాఖపట్టణంలోని సీఎంఎఫ్ఆర్ఐ ప్రాంతీయ కేంద్రం హెడ్ డాక్టర్ జోకే కుజాకుడిన్ అన్నారు. మండలంలోని బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని ఆరగట్లపాలెంలో భారతీయ పొంపెనో కల్చర్‌పై అవగాహన కల్పించారు. ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిని గుర్తించి వలలు, కేజ్ ఉపకరణాలు, యాంకర్లు, చేప పిల్లలు, చేపలకు అవసరమైన మేతను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతాల్లోని ఉప్పు జలాల్లో భారతీయ పొంపెనో కల్చర్‌తో అధిక లాభాలు ఆర్జించొచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త జయశ్రీ, ఆర్‌డీ సురేష్, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

రావులపాలెం: అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు కాంగ్రెస్ పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి రౌతు ఈశ్వరరావు రూ.వెయ్యి నగదు, వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఆలమూరు గ్రామ శివారు వెలమల వీధిలో నివాసం ఉంటున్న మట్ట సత్యవతి, సత్యనారాయణ దంపతులు పూరి పాకలో నివాసం ఉంటున్నారు. అగ్ని ప్రమాదం జరిగి పూర్తిగా నష్టపోవడంతో విషయం తెలుసుకున్నఈశ్వరరావు వారిని పరామర్శించి, స్థానిక రౌతు ట్రస్టు కార్యాలయంలో సోమవారం సాయం అందజేశారు.